# చెల్లని రూపాయి

అది శివరామయ్యగారి దగ్గిరికి ఎట్లా వచ్చిందో తెలీదు, ఆ చెల్లని రూపాయ. మసక కళ్ళవాడు కనుచీకట్లో కూడా ఆ రూపాయ చెల్లదని కనుక్కో-వచ్చు – చెల్లని రూపాయల్లో కూడా మరీ వెధవ రూపాయ, ఆ చెల్లని రూపాయ! అది రూపాయల్లే మోగదు. దాని రంగే రూపాయ రంగు కాదు, అది రూపాయ బరువు లేదు. అది చేతికైనా రూపాయల్లే తగలదు. మందమతివాడు కూడా దాన్ని రూపాయ అనుకోటానికి వీల్లేదు – చెల్లని రూపాయల్లో కూడా అంత మరీ వెధవరూపాయ ఆ చెల్లని రూపాయ!

అది శివరామయ్య చేతబడటం మరీ అన్యాయం. శివరామయ్య సాధువు. భక్తి శూన్యమైన ప్రపంచంలో, ఈ కలియుగంలో మళ్ళా ప్రహ్లాదుడల్లే పుట్టాడు శివరామయ్య. బియ్యే పాసయి రెండు మూడేళ్ళు ప్లీడరీ చేసి కూడా లౌకిక

సంబంధాలన్నీ తెంచుకుని, ఆర్యధర్మాన్ని అవలంభించిన, ఊరికే పైన పటారమూ లోపల లొటారమూ కాకుండా నిజంగా మనోవాక్కాయాల ధర్మరాజల్లే నడుచుకుంటూ, అన్నిరకాల వాళ్ళచేతా ఔననిపించుకుంటున్నాడు శివరామయ్య.

అతన్ని తప్పుపట్టినవాడు ఎటొచ్చీ మా శర్మ ఒక్కడే. (శర్మ కొక్కిరాయవెధవ అని ఎవరెరగరు గనకా?) "వీడు మోక్షానికి అడ్డదార్లు వెతుకుతున్నాడల్లే ఉందిరా! ఈ శివరామయ్య పిప్పుపారంనించీ బియ్యేదాకా నోట్సు చదివి పరీక్షలు పాసయిన ఘటం!" అనేవాడు శర్మ – కొక్కిరాయ వెధవ!

శివరామయ్యది శుద్ధాంతఃకరణ. వాడు బంగారాన్ని మట్టిగా చూసేవాడు, పరస్త్రీని తల్లిలాగ చూసేవాడు. వాడి మనస్సు పరిపక్వమయింది – శర్మ వెయ్యి అన్నుగాక!

ఆటువంటి శివరామయ్య చేతికి వచ్చింది. ఈ దిక్కుమాలిన చెల్లని రూపాయ.

ఆ చెల్లని రూపాయది ఎంత శక్తో! అది శివరామయ్య యొక్క పరిపక్వమైన మనస్సును సూటిగా, స్వయంగా జయించగలిగి ఉండదు; అందుకని అది శివరామయ్య యొక్క అపరిపక్వమైన అంతరాత్మ ద్వారా శివరామయ్య మనస్సులో తెగులు ప్రవేశపెట్టింది. మామూలు రూపాయలను మట్టిగా చూసే శివరామయ్య ఎవరైనా "దేహి!" అని చెయిచాస్తే జేబులో ఎంత ఉన్నదీ లెక్క చూడకుండా తీసి ఇచ్చివేసే శివరామయ్య, ఈ మహా నాటకంలో తాను ధరించటానికి పూనుకున్న పాత్ర యొక్క ప్రకృతి శీలాదులన్నీ సంపూర్ణంగా మరచిపోయి, ఆ రూపాయను ఎట్లా వదిలించుకోవటమా అని ఆరాటపడసాగాడు.

ఒకనాడు శివరామయ్య ఆ రూపాయతోపాటు మరొక మంచిరూపాయ జేబులో వేసుకుని, వెచ్చాల అంగడిలో కొన్ని సరుకులు కొని, నిర్లక్ష్యంగా జేబులోనించి రూపాయ తీసి కోమటికిస్తే, ఆ కోమటి దానివంకనన్నా చూడకుండా దాన్ని గల్లాలో వేసుకుని చిల్లరతీసి శివరామయ్యకిచ్చాడు. శివరామయ్య ఇవతలికి వచ్చి కొట్టుకుంటున్న గుండెతో జేబులోనించి మిగిలిన రూపాయ చూసుకుంటే అది ఆ దిక్కుమాలిన చెల్లని రూపాయే! నిశ్చింతగా జేబులో ఉంది.... ఇంతకూ భగవంతుడు శివరామయ్య పక్షాన లేడు.

ఆ తరవాత శివరామయ్య వంచనతో మరొకమెట్టు దిగాడు. చెల్లని రూపాయ ఒక జేబులోనూ మంచి రూపాయ మరొక జేబులోనూ పెట్టుకుని ఆయన బట్టల దుకాణంమీదికి వెళ్ళి తన భార్యకు ఒక గజం రెవికగుడ్డకొని నిర్లక్ష్యంగా జేబులోనించి రూపాయతీసి బల్లమీద పడేస్తేనే, రూపాయ ఖంగుమని మోగటంతో పూటా బయటపడుతుందని జ్ఞాపకం వచ్చి, గట్టిగా నాలుక

కోరుక్కున్నాడు. కాని అది వృథాబాధ అయింది – బల్లమీదపడ్డ రూపాయ బాగానే మోగింది. పూటా రూపాయ ఉన్నది మరో జేబులో!

అక్కడ బయలుదేరి శివరామయ్య చెల్లని రూపాయను మామూలుగా చేతికి అలవాటైన జేబులోకి మార్చి, పచారీ దుకాణంమీదికి వెళ్ళి ఒక పాలడబ్బా కొని, ఏమీ ఎరగనివాడల్లే మాట్లాడకుండా ఆ పడని రూపాయతీసి ఆ దుకాణదారు చేతిలో పెడితే, అతను ఎవరికో సమాధానం చెబుతూ ఆ రూపాయ మిగతా రూపాయల్లో వేసుకున్నాడు. కాని మరుక్షణమే అన్ని రూపాయల మోతలోనూ ఆ పాపిష్టి చెల్లని రూపాయమోత అపస్వరమల్లే అతని చెవికి సోకిందో ఏమో, అతను పాము కరిచినవాడల్లే ఉలిక్కిపడి, రూపాయల్లోకి ఇట్టే చూసి, చప్పున ఆ పడని రూపాయను పైకిలాగి, "ఇది పడదు, స్వామీ! మరొకటిప్పించండి!" అని సవినయంగా అన్నాడు. అప్పుడు శివరామయ్య ఆశ్చర్యం నటించవలిసి వచ్చింది, నటించాడు నటించటమనేది శివరామయ్యకు, పాపం, చాతకానివిద్య; కాని చేసిన ప్రయత్నం మెచ్చుకోదగినట్టుగానే ఉండింది.

"పూటా రూపాయా? ఎవరిచ్చారబ్బా!.... సరే, నీ దగ్గరే ఉండనీ, నా దగ్గర చిల్లరలేదు, తరవాత చిల్లరఇచ్చి దాన్ని నేనే తీసుకుపోతానులే!" అని అని చూశాడు శివరామయ్య. దుకాణదారు తక్కువ తిన్నవాడు కాడు.

"డబ్బు లెక్కడికిపోతై, స్వామీ తరవాత ఇవ్వండి! నా దగ్గర ఇది కూడా ఎందుకూ" అన్నాడతను.

ఆ రూపాయ ఎక్కడా చెల్లలేదు. సినిమాల దగ్గిరా, కాఫీ హోటళ్ళలో, దుకాణాల్లో, పోస్టాఫీసులో, బాంకిలో – ఎక్కడా ఎవరూ తీసుకోలేదు. ఆ దిక్కుమాలిన చెల్లని రూపాయను.

రైలుస్టేషనులో బుకింగుక్లర్కు "ఈ రూపాయ చెల్లదు. ఇంకొకటి ఇవ్వండి!" అన్నాడు మర్యాదగా.

"మంచిదేనే!" అన్నాడు శివరామయ్య అర్థం లేకుండా.

"కావాలంటే కత్తిరించి పూటా చూపిస్తాను!" అన్నాడు బుకింగుక్లర్కు....

ఆ రూపాయ మార్చాలని ప్రయత్నం చెయ్యటంలో శివరామయ్య అవమానంపాలూ అప్రతిష్ఠపాలూ అయ్యేటట్టు కనపడ్డది. అన్నిటికన్నా ముందు లక్షమైనవాళ్ళ దగ్గిరా అశ్చర్యం నటించటం ఆయన ప్రాణంమీదికి వచ్చింది. అతడి ఆశ్చర్యం అందరిమీదా పారుచున్నట్టులేదు. ఒకరిద్దరు మందహాసం కూడా చేశారు.

ఏమయినాసరే ఆ రూపాయను ఇకముందు తొక్కుపద్ధి అయినవాళ్ళ దగ్గర బయటికి తియ్యకూడదని శివరామయ్య తీర్మానించుకున్నాడు.

ఇంతలో దేవుడు పంపినట్టు ఒక చిల్లిడబ్బా పట్టుకుని ఎవరో చందాకు వచ్చారు. ఆ రూపాయను వదిలించుకోవటానికి అంతకంటె మంచి అవకాశం ఏముందీ? కాని అదేదో భగవద్విషయకమైన చందా. ఒక్క రూపాయకోసం పాపం తెచ్చుకోవటం ఎట్లా? శివరామయ్య ఆ డబ్బాలో మంచి రూపాయ తెచ్చి వేశాడు....

"నెలజీతం ఇప్పించండి, అయ్యగారూ! ఇంట్లో గింజల్లేవు. ముసలాడు మంచమెక్కాడు. బుడ్డోడికి రేత్తిరినించీ గంజయినా లేదు." అని అడిగింది పనిమనిషి. దానికింకా నెలకాలేదు.

శివరామయ్య మనస్సు చిక్కబట్టి ఆ దిక్కుమాలిన చెల్లనిరూపాయ దానిచేతిలో పెట్టాడు. అది కృతజ్ఞతతో పెట్టిన ప్రతిదణ్ణమూ శివరామయ్యకు ఒక్కొక్క బల్లెపుపోటల్లే ఉండటమేకాక ఆ వెధవరూపాయ వదిలిన తృప్తి అతడికి కలగలేదు. ఆ రూపాయ తన్నంత సులభంగా వదులుతుందా? అది దానికి మాత్రం ఎట్లా మారుతుందీ? ఆ ముసలిముండ ఎట్లాగో ఆ రూపాయ తెచ్చి మళ్ళీ తనమీద పారేస్తుంది, "ఇది నేనిచ్చిన రూపాయకాదు!" అనటానికి తనకు నోరురాదు. పాపం కూడాను! — ఈ విధంగా మధనపడ్డాడు శివరామయ్య.

కాని ఆ పనిచేసే ముండ ఆయన జోలికి మళ్ళీ రాలేదు. విశ్వప్రయత్నం చేసినా ఆయనకు మారని ఆ రూపాయ దానికి ఇట్టే మారి ఊరుకుంది!

(ప్రథమ ముద్రణ : జూన్ 1938, భారతి)